పిడుగుపాటుకు నలుగురి మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 24: తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పలు చోట్ల పిడుగులు పడి నలుగురు మృత్యువాతపడగా.. పలువురు గాయపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురువగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షం పడింది. ఖమ్మం నగరంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జగ్గారం శివారు బూరుగుగుంపునకు చెందిన కూలీలు కట్టం నాగశ్రీ (22), సున్నం అనూష (23) మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బత్తులపల్లికి చెందిన లక్ష్మయ్య (65) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో సోమవారం రాత్రి పిడుగుపడి ఎర్రబొజ్జు రాధిక ఇల్లు ధ్వంసమైంది. ఇంట్లో వారు ఊరికి వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. దీంతో ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని అధికారులు మూసివేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటలో పిడుగుపడి పశువుల కాపరి కృష్ణకుమార్ (30) మృతి చెందాడు. వారం రోజులుగా వానలు లేక బీటలు వారుతున్న వరికి ఈ వర్షం ఊరటనిచ్చింది. పత్తి పంట రైతులకు సైతం కలిసొచ్చింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వరంగల్, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జోగుళాంబ-గద్వాల, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలకు రిశాయి. ఖిల్లా-వరంగల్ మండలంలో 9.67 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

ఎమ్మెల్యే గాంధీపై చర్యలు తథ్యం

- **ఆయన అనుచరులపైనా కేసు**
- **రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల్లేవ్**
- **ఉగ్రవాదుల జాడ కూడా లేదు.. ఉంటే చెప్తాం**
- **విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకుంటామని, ఆయన అనుచరులపైనా కేసులు నమోదు చేశామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, గాంధీ వివాదంపై స్పందిస్తూ ఇప్పటికే గాంధీ, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ జరుగుతున్నందున తెలంగాణలోకి మావోయిస్టులు వస్తే.. తమ భద్రతా దళాల నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని, అవసరమైతే ఎన్‌కౌంటర్లకూ వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మినహా తెలంగాణలో మావోయిస్టుల కదలికలు లేవని చెప్పారు. హైదరాబాద్‌లో ఉగ్రవాదుల జాడ లేదని తెలిపారు. ఉగ్ర కదలికలపై నిఘా ఉంచామని, సమాచారం ఉంటే తెలియజేస్తామని చెప్పారు. వినాయక నిమజ్జనాల్లో డీజే సిస్టమ్స్ ఉపయోగించొద్దని, వాటివల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని సూచించారు. చిన్న చిన్న ఘటనలు మినహా వినాయక చవితి, నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. మొత్తం 5,879 ప్రాంతాల్లో 1,36,638 విగ్రహాలు నిమజ్జనం చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 మంది పోలీసులు, 47 ప్లాటూన్స్‌తో విధులు నిర్వర్తించినట్టు చెప్పారు.

జైనూర్ ఘటన దురదృష్టకరం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జైనూర్ ఘటన దురదృష్టకరమని డీజీపీ అన్నారు. వెంటనే పరిస్థితిని అంచనా వేసి, 38 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 720 మంది పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో జైనూర్ మొత్తం మోహరించామని వివరించారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీ, ఐజీతో భద్రతను పర్యవేక్షించామని తెలిపారు. సివిల్ కేసుల్లో తలదూర్చిన చిక్కడపల్లి ఏసీపీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. దానికి చాలా ప్రాసెస్ ఉంటుందని సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డప్పు కొట్టకపోతే గ్రామ బహిష్కరణ చేసిన ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఆ వెలివేతకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏడీజీ మహేశ్ భగవత్, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

ప్రాథమిక బడుల్లో ప్రీ ప్రైమరీ

- **బాలవాటిక పేరుతో తరగతులు**
- **అధికారులను ఆదేశించిన సీఎం**
- **ప్రత్యేకంగా పాలసీ రూపకల్పన**
- **అంగన్‌వాడీల పరిస్థితి ఏంటి?**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం సర్కారు బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించాలనుకుంటున్నది. బాలవాటిక పేరుతో తరగతులను నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు తీవ్రతరం చేశారు. రాష్ట్రంలో 18,241 ప్రాథమిక బడులున్నాయి. 3,144 ప్రాథమికోన్నత బడులను పీఎస్‌లలో విలీనం చేయనున్నారు.

ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రభావం..

ప్రస్తుతం పూర్వప్రాథమిక విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నది. సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ బడుల్లో నర్సరీ నుంచే విద్యార్థులను చేర్చుకుంటుండంతో వారు అక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించడం ద్వారా నర్సరీ దశలోనే విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల బాట పట్టే వీలుంటుందన్న ఆలోచనలో కసరత్తు చేస్తున్నది.

అంగన్‌వాడీలుంటాయా..?

రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6.67లక్షల మంది మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్కులు నమోదయ్యారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) పూర్వ ప్రాథమిక విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకెళ్తున్నది. దీంతో అంగన్‌వాడీలు ఉంటాయా..? అన్న చర్చ నడుస్తున్నది. ప్రీ ప్రైమరీ బోధనకు కొత్త టీచర్లను నియమించాలని యోచిస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితేమిటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

● ఇస్రో చైర్మన్‌కు పుస్తక బహూకరణ

రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, రీజియన్ మళయాలీ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూన్స్ పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ తన కార్టూన్ల పుస్తకాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్,పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు.

నేడు, రేపు ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించే చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు అధికారులు మరో అవకాశమిచ్చారు. బుధ, గురువారాల్లో తాత్కాల్ కింద ఫీజు చెల్లించేందుకు అవకాశమిచ్చినట్టు డైరెక్టర్ సీవీ శ్రీహరి ప్రకటనలో తెలిపారు. పదోతరగతి వారు రూ.500, ఇంటర్మీడియట్ వారు రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 9వరకు వార్షిక పరీక్షలను నిర్వహించనుండగా, ఈనెల 30న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని తెలిపారు.

భూవివాదంలో రాళ్ల దాడి

- **రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఘర్షణ**
- **అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో ఉద్రిక్తత**

గాయపడ్డ రైతు

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 24: ఓ భూమి విషయమై రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఏర్పడిన గొడవ.. రాళ్లు, కర్రల దాడి వరకు వెళ్లింది. ఈ ఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో చోటుచేసుకుంది. పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17లో గోపాల్‌యాదవ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. పలువురు రైతులు వెంచర్‌లోకి వెళ్లి.. ఇందులో సర్కారు పట్టాలు ఇచ్చిన సీలింగ్ భూమి ఉన్నదంటూ ట్రాక్టర్‌తో పనులు చేసేందుకు యత్నించారు. దీన్ని వెంచర్ నిర్వాహకులు, సిబ్బంది అడ్డుకుంటుంటే.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకోగా పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. గాయపడ్డ రైతుల్లో పంది ముత్తయ్య, నర్సింహ, ఆకుల సత్యనారాయణ, శంకర్, మరో ఇద్దరు ఉండగా.. వెంచర్ నిర్వాహకుల్లో లోకేశ్, దర్శన్ రెడ్డి, మరొకరు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వనస్థలిపురం ఏసీపీ, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వెంచర్ నిర్వాహకులు సంప్రదింపుల కోసం పిలిచి దాడి చేశారని, కులం పేరుతో దూషించారని రైతులు ఫిర్యాదు చేశారు. వెంచర్‌లోకి చొరబడిన కొందరు స్థానికులు.. వెంచర్ నిర్వాహకులు, సిబ్బందిపై దాడికి దిగారని ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా.. పిగ్లీపూర్‌లో తమకు ప్రభుత్వం సీలింగ్ భూములిచ్చి పట్టాలు అందజేసిందని, ఆ భూముల్లోకి జరిగి కొందరు వెంచర్ చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. గతంలో పని చేసిన మండల రెవెన్యూ అధికారి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారని విమర్శించారు. వెంచర్ నిర్వాహకులు మాట్లాడుకుందామని పిలిచి, మహిళలు, పెద్ద మనుషులపై సిబ్బందితో దౌర్జన్యంగా రాళ్లు, కర్రలతో దాడిచేయించారని వాపోయారు. మరోవైపు, తమ వెంచర్‌లోని సర్వేనంబర్‌లో ఎలాంటి సీలింగ్ భూమి లేదని నిర్వాహకులు చెప్తున్నారు.

డీజీపీ ఆఫీస్ ఎదుట న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం

న్యాయమా.. నువ్వెక్కడ!

- **తమ బిడ్డ హత్యపై నిగ్గు తేల్చాలని బాధితుల డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అయ్యా నా బిడ్డది రోడ్డు ప్రమాదం కాదు. ముమ్మాటికీ హత్యే. సాక్ష్యాల్లేవని, రోడ్డు ప్రమాదంగా తేల్చి పోలీసులు కేసు మూసేశారు. మరోసారి విచారణ చేపట్టి న్యాయం చేయండి' అంటూ కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బాధిత కుటుంబం జోరు వానలో డీజీపీ కార్యాలయం ముందు ఆర్తనాదాలు చేసింది. చొప్పదండి మున్సిపాలిటీకి చెందిన మందా విను జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షల నేపథ్యంలో స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని తల్లి చెప్తున్నది. స్థానిక పోలీసులు డబ్బు తీసుకొని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసు కొట్టివేశారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై జూలైలో డీజీపీ ఆఫీసులో మొర పెట్టుకోగా.. డబ్బు తీసుకున్న డీఎస్పీ, ఎస్సైకే మళ్లీ విచారణ బాధ్యతలు అప్పగించారని, దీంతో తమకు న్యాయం జరగలేదని ఆవేదనను వెళ్లగక్కారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండదండలు ఉండటం వల్లే తమకు అన్యాయం చేస్తున్నారని బోరున విలపిస్తూ చెప్పారు. ఈ కేసును రీఓపెన్ చేయించి, ఇంటెలిజెన్స్ పోలీసులతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా తిరుందాసు వెంకటేశ్

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 24 : జిల్లా ల్యాండ్ అక్వ్యేషన్ డిప్యూటీ కలెక్టర్‌గా తిరుందాసు వెంకటేష్ మంగళవారం బాధ్యతలు చేట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) జిల్లా అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయనను మర్యాద పూ ర్వకంగా కలిసి శ్రీ భక్త మార్కండేయ మహర్షి మెమెంటోతో పాటు చేనేత కండువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బిట్లా రాజ రవితేజ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పిట్ట ఉమాదేవి, శకుంతల దేవి, జిల్లా కోశాధికారి వంగ కుమారస్వామి, కార్యవర్గ సభ్యులు రాణా ప్రతాప్, విశ్వనాథం, కిరణ్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

రేగొండ, సెప్టెంబర్ 24 : విద్యతో పాటు ప్రతీ విద్యార్థి క్రీడలపై ఆసక్తి చూపాలని చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్ అన్నారు. ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా ఎంపికకు రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం గోరికొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించగా సీఐ హాజరై మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రం, ఎస్సై సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

గోవిందరావుపేట, సెప్టెంబర్ 24 : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మోడల్ పాఠశాలలో విద్యార్థులకు బోధన అందించి ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ రేండ్ల సంతోష్ అన్నారు. గత 11ఏళ్లుగా ఒకే పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న 12మంది ఉపాధ్యాయులను స్థానిక ప్రిన్సిపాల్ రాంచందర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. వారి సేవను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ సలీంపాషా, నిజామొద్దీన్, ఎస్‌ఎంసీ చైర్మన్ హరితతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నదుల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ

చిట్యాల (మొగుళ్లపల్లి), సెప్టెంబర్ 24 : మండలంలోని మొట్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు నదుల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పదో తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ వరంగల్ కమాండింగ్ అధికారి ఎస్ సెంథిల్ రామదురై ఆదేశాల మేరకు మంగళవారం ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నదుల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్, హెచ్‌ఎం లింగాల కుమారస్వామి తెలిపారు. అనంతరం బతుకమ్మ వాగు, బతుకమ్మ ఆడే చోట స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా చెత్త తొలగించి శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి జంపాల సుజాత, ఉపాధ్యాయులు నరసింహస్వామి, సంపత్‌కుమార్, వీరయ్య, ఉమారాణి, కే రవీందర్, గ్లోరి రాణి, ఎన్ రవీందర్, శోభారాణి, శకుంతల పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

తాడ్వాయి, సెప్టెంబర్ 24 : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని మనం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు చౌలం శ్రీనివాసరావు, ఇందిరానగర్ పాఠశాల హెచ్‌ఎం రేగ కేశవరావు అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం స్వచ్ఛహీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. మానవాళికి ఆక్సిజన్ అందించే పచ్చని చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు.

విద్యార్థుల అభివృద్ధికి క్రీడలు దోహదం

చిట్యాల (మొగుళ్లపల్లి), సెప్టెంబర్ 24 : విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి క్రీడలు దోహదపడతాయని ఎంఈవో ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం విజయపాల్‌రెడ్డి అధ్యక్షతన క్రీడా పోటీలు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. క్రీడలతో విద్యార్థినీ విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, సోదర భావం, నాయకత్వ లక్షణాలు ఏర్పడుతాయన్నారు. గెలుపోటములు ముఖ్యం కాదని పాల్గొనవడమే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీడీ, పీఈటీలు సురేశ్, సందీప్, శ్రావణి, శ్రీనివాస్, అజయ్, కార్తీక్, వేల్పుల రాజు, ఇంచర్ల రాజు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పలిమెల, సెప్టెంబర్ 24 : ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ రమేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం అంబట్‌పల్లి పీహెచ్‌సీ పరిధి దమ్మూరులో పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దమ్మూరులో ఇటీవల డెంగీ జ్వరం వచ్చిన వ్యక్తి ఇంటిని సందర్శించి ఇంటితోపాటు పరిసరాల్లో మందు పిచికారీ చేయించారు.

తాగునీటి కోసం లైన్ ఎస్టిమేట్ ఇవ్వాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 24 : ప్రజల మంచినీటి సౌకర్యం కోసం తక్షణమే సంబంధిత శాఖల అధికారులు లైన్ ఎస్టిమేట్ ఇవ్వాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం సాయంత్రం మంజూరునగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని చెన్నాపూర్ జీపీ పరిధి రూపిరెడ్డిపల్లి, దామరాంచపల్లి క్రాస్ రోడ్డు, చిన్నకోడెపాక, విజ్జయ్యపల్లి మీదుగా రాజక్కపల్లి గ్రామం వరకు లైన్ ఎస్టిమేట్ తయారు చేసి ఇవ్వాలని అధికారులకు సూచించారు. దామరంచపల్లి, చిన్న కోడెపాక, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లి గ్రామాల పరిధిలోని లోలెవల్ వంతెనలు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతులు చేయాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న రోడ్లు, మంచి నీటి పైపులైన్లు, సైడ్ డ్రైనేజీ తదితర పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ శబరీష్

క్రీడా నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటాలి

ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్

ములుగురూరల్, సెప్టెంబర్ 24 : గ్రామీణ యువత క్రీడా నైపుణ్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ అన్నారు. డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో భాగంగా మండలంలోని జాకారంలో యువతకు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముందుగా ఎస్పీ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ డ్రగ్స్ అమ్మినా, సేవించినా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. డయల్ 100కు కాల్ చేసి డ్రగ్స్ అమ్ముతున్న వారి సమాచారం తెలియజేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం యువతతో కలిసి మాదకద్రవ్యాల నిర్మూలన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఓఎస్డీ మహేశ్ బాబా సాహెబ్‌గీతే, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, రాములు, సీఐలు శంకర్, రవీందర్, ఎస్సైలు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన

గణపురం,సెప్టెంబర్ 24 : మండలంలోని పంటలను మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రమేశ్, ఏవో దేశబోయిన అయిలయ్యతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల సంరక్షణపై రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి చేనులో నీరు నిల్వ ఉంటే మొక్కలు చనిపోయే అవకాశం ఉందని, కాలువలు తీసి నీటిని బయటలకు పంపాలన్నారు. పైపాటుగా ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాశ్ వేయాలని, పూత, కాయలు రాలకుండా నివారించేందుకు 10 గ్రాముల 13-0-45 మందును లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. వరిలో అగ్గి తెగులు నివారణకు నత్రజని సంబంధిత ఎరువులను తక్కువగా వేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈవోలు మౌనిక, కల్యాణ్, రైతులు ఉన్నారు.

వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గీత కార్మికులకు 'కాటమయ్య రక్షక కవచం'

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 24 : గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా కాటమయ్య రక్షక కవచం కాపాడుతుందని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శైలజ అన్నారు. మంగళవారం భూపాలపల్లి మండలం సోలిపేటలో గీత కార్మికులకు తెలంగాణ కల్లు గీత కార్మికుల ఆర్థిక సంఘం హైదరాబాద్ సహకారంతో అందజేయనున్న కాటమయ్య రక్షక కవచం (సేఫ్టీ కిట్స్)పై శిక్షణ ఇచ్చారు. శైలజ మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కాటమయ్య రక్షక కవచాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై షేక్ రబ్బాని, గీత కార్మికులు పాల్గొన్నారు.

కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం

ఏటూరునాగారం, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించి పిచ్చి మొక్కలు, చెత్త తొలగించి కళాశాల ఆవరణను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీ అశోక్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు మాలతీదేవి, రాజ్‌కుమార్, భిక్షం, వెంకన్న, ఉపేందర్, కార్తీక్, రామకృష్ణ, నరేశ్, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి

మహదేవపూర్, సెప్టెంబర్ 24 : విద్యార్థులు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే కార్యక్రమాన్ని డిగ్రీ కళాశాలలలో ఆఫీసర్ వంగపల్లి పరుశరాములు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రోగాం ఆఫీసర్ టీ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్, రాజు, మున్నయ్య, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రపల్కల ప్రసాద్, పిన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల్లో పోషణ లోపాన్ని నివారించాలి

మహదేవపూర్, సెప్టెంబర్ 24 : చిన్నారుల్లో పోషణ లోపాన్ని నివారించాలని సీడీపీవో రాధిక అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని జీపీ కార్యాలయ ఆవరణలో పోషణ మాసంలో భాగంగా తల్లులు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. చిరు ధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను ప్రదర్శించారు. డీసీపీవో వెంకటస్వామి, వుమెన్ హబ్ సెంటర్ ఇన్‌చార్జి అనూష, మమత, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ స్వప్న, జీపీ కార్యదర్శి కల్పన, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, నాగరాణి పాల్గొన్నారు.

ములుగు మున్సిపాలిటీ బిల్లును ఆమోదించాలి

గవర్నర్‌ను కోరిన మంత్రి సీతక్క

గవర్నర్‌తో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : సాంకేతిక పరమైన చిక్కులతో ఇంత కాలం పెండింగ్‌లో ఉన్న ములుగు మున్సిపాలిటీ ఏర్పాటు బిల్లును ఆమోదించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కోరారు. మంగళవారం మంత్రి రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ములుగు మున్సిపాలిటీ బిల్లుతో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర బిల్లులకు ఆమోదం తెలపాలని కోరారు. ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చుతూ 2022లో గత ప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేసిన బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని వినతిపత్రం అందజేశారు. తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లులోనే ములుగు మున్సిపాలిటీ అంశాన్ని చేర్చగా రాష్ట్రపతి ఆమోదానికి అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పంపించడంతో ఈ బిల్లు పెండింగ్‌లో ఉందన్నారు. బిల్లు వివరాలను గవర్నర్‌కు మంత్రి సీతక్క అందజేశారు.

సీనియర్ హెచ్‌ఎంలకు ఎంఈవోగా బాధ్యతలు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 24: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న సీనియర్లకు ఎంఈవో (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం సాయంత్రం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి మండలం కొంపెల్లి హెచ్‌ఎం దేవాను భూపాలపల్లి ఎంఈవోగా, చిట్యాల పాఠశాల హెచ్‌ఎం కే రఘుపతిని చిట్యాల, మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి హెచ్‌ఎం ఎల్ కుమారస్వామిని మొగుళ్లపల్లి, కాటారం మండలం దేవరాంపల్లి హెచ్‌ఎం ఐ శ్రీదేవిని కాటారం, టేకుమట్ల హెచ్‌ఎం సీ సుధాకర్‌ను టేకుమట్ల, రేగొండ మండలం రంగయ్యపల్లి హెచ్‌ఎం వీ ప్రభాకర్‌ను రేగొండ, మల్హర్‌రావు మండలం రుద్రారం హెచ్‌ఎం జీ లక్ష్మణ్‌బాబును మల్హర్‌రావు, మహాముత్తారం మండలం మొలుగుపల్లి హెచ్‌ఎం పీ సంజీవరెడ్డిని మహాముత్తారం, మహదేవపూర్ మండలం బొమ్మపూర్ హెచ్‌ఎం డీ శంకరయ్యను మహదేవ్‌పూర్, మహదేవపూర్ మండలం ఎంబాడిపల్లి హెచ్‌ఎం కే వెంకట్రాజంను పలిమెల, గణపురం మండలం ధర్మారావుపేట హెచ్‌ఎం ఉప్పలయ్యను గణపురం, గోరికొత్తపల్లి మండలం జగ్గయ్యపేట హెచ్‌ఎం ఓ చంద్రశేఖర్‌ను గోరికొత్తపల్లి ఎంఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

ఏటూరునాగారం, సెప్టెంబర్ 24 : అశాస్త్రీయమైన టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పొడెం సమ్మయ్య ఒక ప్రకటనలో కోరారు. విద్యారంగం బలోపేతం కోసం ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని చెప్తూనే అశాస్త్రీయంగా సర్దుబాటు చేయాలని విద్యాశాఖ జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన ఆదేశాలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. ప్రాథమిక పాఠశాలలో పది మంది పిల్లలకు ఒకరు, 11నుంచి 60 మంది పిల్లలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశాలు ఉండవన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి తరగతికి గది ఉండాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మిర్చి సాగుపై అవగాహన సదస్సు

చిట్యాల, సెప్టెంబర్ 24 : మండలకేంద్రంలోని రైతు వేదికలో మిర్చి సాగుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోతన ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్పీ కొచ్చిన్ ద్వారా ఏర్పాటు చేసిన సదస్సుకు ఎన్ఎస్ఎస్పీ మాస్టర్ ట్రైనర్ ఉపేందర్‌రెడ్డి, హార్టికల్చర్ భూపాలపల్లి డివిజనల్ ఆఫీసర్ సునీల్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ శ్రీదేవి హాజరయ్యారు. ఐపీఎం పద్ధతులు సేంద్రియ సాగు, పంట కోతల విధానం, మార్కెటింగ్ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పలిమెల, సెప్టెంబర్ 24 : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి అన్నారు. మంగళవారం మండలంలోని పంకెన అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్క్రీనింగ్ చేశారు. పోషణ విలువలు, చిరు ధాన్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎంపీహెచ్ లక్ష్మి, ఏఎన్‌ఎం భ్యూలా, అంగన్‌వాడీ టీచర్ నిర్మల పాల్గొన్నారు.